విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

శనివారం 16, డిసెంబరు 2023 8పేజీలు

రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన మహనీయులు పొట్టి శ్రీరాములు: ఇంచార్జి కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : ఆంధ్ర రాష్ట్రసాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసిప్రాణాలు అర్పించిన మహనీయులు శ్రీపొట్టి శ్రీరాములు త్యాగాన్నిస్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ అన్నారు.అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములువర్ధంతి సందర్భంగాశుక్రవారంకలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్ కూర్మనాథ్, జిల్లా రెవెన్యు అధికారి లవన్న, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్యలతో కలసి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయులు శ్రీ పొట్టి శ్రీరాములు అని, వారి వర్ధంతి సందర్భంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు శ్రీ పొట్టి శ్రీరాములకు ఘనంగా నివాళులు అర్పించడం జరుగుచున్నదన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీజీ అడుగుజాడల్లో నడిచి,ఏవిధంగానైతే అహింస, సత్యాగ్రహంఅనే రెండు ఆయుధాలతో గాంధీజీదేశస్వాతంత్ర్యాన్నిసాధించారోఅదే స్ఫూర్తితో శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించి, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు కారకులైనారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత అని, వారి పట్టుదల, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని విధి నిర్వహణలో సమాజ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఇంచార్జి కలెక్టర్ అన్నారు. జిల్లా రెవెన్యు అధికారి లవన్న మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములను స్మరించుకుంటూ, వారి త్యాగాలకు ప్రతీకగా జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణ చేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ప్రాణాలు అర్పించిన మహనీయులు శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను నేడు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి షఫీ మాలిక్, కలెక్టరేట్ సిబ్బంది, బిసి సంక్షేమ శాఖ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి :జడ్పీ చైర్‌పర్సన్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ఆనంఅరుణమ్మపిలుపునిచ్చారు.శుక్రవారంజిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధంలో పోరాడి వారి అవయవములు కోల్పోయిన సైనికులపట్లసంఘీభావంతెలిపేందుకుడిసెంబర్ 3వ తేదిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఆనవాయితీగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల్లో ధైర్యం, స్ఫూర్తిభావం నెలకొల్పేడమే ఈ దినోత్సవ ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో సుమారు 64,432 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని, వీరంతా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులైన బాలికలకు రాష్ట్ర ప్రభుత్వంచే వసతి గృహం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో, మానసిక వైకల్యం, బదిరత్వం గల పిల్లలకు జిల్లలో ఐదు ప్రత్యేక పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల కొరకు జిల్లలో 6 సదరం అసెస్ మెంట్ క్యాంపులు నిర్వహించి,వారికి సర్టిఫికెట్స్ అందచేయడం జరుగుచున్నదని, వీటిని పొందివున్న వారికి ఆర్టీసీ బస్సులు, రైలు ప్రయాణాలలో ప్రత్యేక రాయితీలు లభిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు అందించే పథకాలను వినియోగించుకొని జీవితాలను ఆనందంగా సాగించాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల ఉపకరణాలను ఆనం అరుణమ్మ అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈవో చిరంజీవి, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అక్బర్ అలీ, సిఆర్‌సి డైరెక్టరు మనోజ్, విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు కోటేశ్వరావు, శివ ప్రసాద్, అంకబాబు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు

అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర - కావలి : అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేపడుతున్న అంగన్వాడీ ల వద్దకు చేరుకొని వారి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు చాలా తక్కువ జీతాలతో పనులు చేస్తున్నారని, పిల్లల ఆలన, పాలన చూస్తూ పాఠాలు నేర్పిస్తూ, అంతే కాకుండా గర్భిణీలకు, పసిబిడ్డ తల్లులకు పౌష్టిక ఆహారం అందిస్తు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో భాగస్వాములై పనులు చేస్తున్నారని, ఇలాంటి వారికి తక్కువ జీతాలు ఇచ్చి ఎక్కువ పనులు చేయించుకోవడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి తగదని అన్నారు. వెంటనే వారి న్యాయమైన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బలిజెపల్లి వెంకటేశ్వర్లు, కొప్పొర్తి నాగరాజు పాల్గొన్నారు.

గ్రూప్ -2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ:మేకపాటి

విశాలాంధ్ర-ఆత్మకూరు : ప్రతి నిరుద్యోగి జీవిత లక్ష్యం ప్రభుత్వ ఉద్యోగం. ఆ లక్ష్య సాధనకు ఆత్మకూరు నియోజకవర్గ యువతకు తోడుగా నిలుస్తానని అంటున్నారు. ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల ఏపీపీయస్సీ ద్వారా గ్రూప్-2 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో 897 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ పోస్టుల కింద 331, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల 566 పోస్టులను భర్తీ చేసేలా నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఆత్మకూరు నియోజకవర్గంలో డిగ్రీ ఆపై చదువులు చదువుకున్న నిరుద్యోగ యువత కోసం ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి గుంటూరులోని టార్గెట్ ఐఏయస్ అకాడమి వారి సహకారంతో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందచేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం తమ ఆత్మకూరు, నెల్లూరు క్యాంపు కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఓ విభాగాన్ని ఏర్పాటు చేసి డిసెంబర్ 27వరకు యువత ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునే విధంగా విధి విధానాలు రూపొందించారు. ఆసక్తి గల యువత తమ విద్యార్హత ధృవీకరణ పత్రాల నకళ్లతో పాటు ఫోటో, అడ్రస్ ప్రూఫ్ తీసుకుని సంప్రదించాలని సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటికే విద్యాభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే యువతకు తాను తోడుగా నిలుస్తానని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్వాడీల సమ్మెకు కాంగ్రెస్ నాయకుల సంఘీభావం

విశాలాంధ్ర - కావలి : తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ సిబ్బందికి కాంగ్రెస్ పార్టీ సంఘీభావం తెలిపింది. కావలి నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు చింతాల వెంకట్రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ముసునూరులోని ఐసిడిఎస్ కార్యాలయం వద్దకు చేరుకొని తమ మద్దతు తెలిపి కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీలకు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం చింతాల వెంకట్రావు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను వైసీపీ ప్రభుత్వం తీర్చకుండా మొండిగా వ్యవహారిస్తుందని, అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగులగొట్టి తెరవడానికి ప్రయత్నిస్తుందని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. స్థానిక నాయకులు, వాలంటీర్లు సెంటర్ తాళాలు పగులగొట్టి రికార్డులు పోవడానికి, సరకులు పోవడానికి కారణం అవుతున్నారని అన్నారు. మీ అనుమతి లేకుండా సెంటర్ తాళాలు పగులగొట్టిన వారిపై కేసులు నమోదు చేయడానికి వెనుకాడవద్దని, కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉండి రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి ఎల్. సురేష్, జిల్లా కార్యదర్శి అంథోని రాజ్, కావలి మండల ప్రెసిడెంట్ కరుణాకర్, కావలి పట్టణ ప్రెసిడెంట్ వాసు, బోగోలు మండల ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, అల్లూరు మండల ప్రెసిడెంట్ సాయి కుమార్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుమ్మా మానస, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు దానం బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా నేడు అవగాహన ర్యాలీ



విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : ఈనెల14 నుంచి 20 వరకు జరగనున్న ఇంధన పొదుపు వారోత్సవాలుజిల్లాలో విజయవంతంగా జరుగుతున్నాయి అనిఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ వి.విజయన్ తెలిపారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన పొదుపు చర్యల ఆవశ్యకతను వారోత్సవాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.నేడు విద్యుత్ శాఖ ఉద్యోగులతో విద్యుత్ భవన్ నుండి కస్తూరిబ్బా కళాపరిషత్ వరకు ఈ ర్యాలీ జరుగుతుంది అని ఈ ర్యాలీ మధ్యాహ్నం 4.00 గంటలకు జిల్లా జాయింట్ కలెకర్ రోణంకి కూర్మనాధ్ ఈ ర్యాలీని జెండాఊపి ప్రారంభిస్తాంన్నారు.ఈ ర్యాలీ లోఅధికారులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

కొత్త బస్సులు రాగానే అన్ని రూట్లకు బస్సులు

- డయల్ యువర్ డియంలో డిపో మేనేజర్

విశాలాంధ్ర - కావలి : త్వరలో కొత్త బస్సులు రానున్నాయని, ప్రయాణికులు కోరుకున్న గ్రామాలకు బస్సులు నడుపుతామని ఎపియస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం డయల్ యువర్ డియం కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రయాణికులు తమ గ్రామాలకు బస్సులు నడపాలని ఆయనను కోరారు. క్రాకుటూరు గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి తమ గ్రామానికి, కావలికి చెందిన అఖిల్ పెంచలకోనకు నూతన సర్వీస్ లను నడపాలని, అల్లూరుకు చెందిన గోవిందరావు, ఆత్మకూరుకు చెందిన రామిరెడ్డి తమ గ్రామాల బస్సు సమయాలను సవరించాలని, తుమ్మలపెంటకు చెందిన షేక్ నవీసాహెబ్, వైకుంఠపురంకు చెందిన వరప్రసాద్ తాము నివాసముంటున్న ప్రాంతం వరకు బస్సును పంపాలని కోరగా వారి విజ్ఞప్తులను పరిశీలించి చర్యలు చేపడుతామని డియం తెలిపారు. తాళ్లపాలెంకు చెందిన సుమంత్ తమ గ్రామం మీదుగా బస్సును పునరుద్ధరించమని కోరగా, రోడ్డు సరిగా లేనందున బస్సును వేరే మార్గంలో నడుపుతున్నామని, రోడ్డు వేసిన పిదప బస్సును పంపుతామని డిపో మేనేజర్ తెలిపారు. తమ డయల్ యువర్ డియం కార్యక్రమానికి స్పందించిన ప్రయాణికులు, ప్రజలకు డియం రాపూరు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహనలేని ఇఇ మాకొద్దు: వైకాపారైతు సమాఖ్య

విశాలాంధ్ర-బిట్రగుంట: కావలి కాలువ కింద ఎన్ని చెరువులు ఉన్నాయి వాటిలో ఎంత నీరు ఉంది పూర్తిగా నింపేందుకు ఇంకెంత నీరు అవసరం అనే అంశాలపై కనీస అవగాహన లేకుండా జిల్లా కలెక్టర్ శాసనసభ్యుడు కావలి కాలువ కింద వరి పైర్లు నాటే రైతులకు మూడు టీఎంసీల నీరు ఇస్తున్నట్లు ప్రకటించినప్పటికీ కావలిఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావలి కాలువకిందరైతులను సమావేశపరిచి ఎవ్వరు వరినాట్లు వేయవద్దనినీరుఇవ్వలేమని చెప్పడంపై బోగోలు మండలంలోని వైకాపా రైతు సమాఖ్య మండిపడింది రైతులఅవసరాలపై అవగాహనలేని అధికారి తమకు వద్దని తేల్చిచెప్పింది. ఈమేరకు బోగోలు మండల వైకాపా కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. పై కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పెన్నానది దిగువకు సుమారు ఐదు టీఎంసీల నీరు సముద్రంలోనికి విడుదల చేశారని దానిలో కొంత మేర రైతులకు పంపిణీ చేసినా రైతులందరూ పంటలు పండించుకుంటారని అవగాహన లేకుండా నీటిపారుదల శాఖ అధికారులు చేసే ప్రకటనలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. పై కార్యక్రమంలో సాగునీటిసలహా మండలిఅధ్యక్షుడు ఉప్పాల మాచర్ల నాగులవరంసొసైటీ అధ్యక్షుడు సుంకే మాల్యాద్రి మండల ఉపాధ్యక్షుడుమాధవరెడ్డి సీనియర్ నాయకులు తూపిలి పెంచలయ్య తుమ్మలరమణయ్య మేకలశ్రీనివాసులు పాశంరవీంద్ర బోగోలు దగదర్తిమండలంలోని రైతులు పాల్గొన్నారు.

సొంత నిధులతో తాగునీరు సరఫరా చేసిన ఇంటూరి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కందుకూరు పట్టణంలో గత నాలుగు రోజులుగా సుందరయ్య నగర్కు తాగునీటి సరఫరా చేయటం లేదు అని అనేక ఇబ్బందులు పడుతున్నాము అని పలువురు మహిళలు ఇంటూరి నాగేశ్వరరావు ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. నాగేశ్వరరావు వెంటనే స్పందించి తన సొంత ఖర్చులు తో ట్యాంకర్ ని తెప్పించి తాగునీటిని సరఫరా చేయించారు. దీంతో సుందరయ్య నగర్ వాసులు ఇంటూరి నాగేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి సంయుక్త సాయం

విశాలాంధ్ర - కావలి : గిరిజన కుటుంబానికి చెందిన గర్భిణీ యేసురాణి కి సంయుక్త సేవా సంస్థ శుక్రవారం సాయం చేసింది. సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ ఎ.వి.ప్రసాద్ రావు దాతృత్వముతో ఒక మంచము, జస్వంత్ డానియల్, ఓ.శ్రీనివాసులు, కే.శ్రీనివాసులు, మానస, లిఖిత, శాంతి వర్ధన్ సహకారంతో బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత బిసి వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఖాదర్ భాషా, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, విశ్రాంత లెక్చరర్ యమ్ వియన్ ప్రసాద్ రావు, ల్యాబ్ టెక్నీషియన్ హరీష్, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

సహస్రనామ పూజలో పాల్గొన్న జనసేన నాయకులు

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: మాజీ మంత్రి పొంగూరు నారాయణ నివాసంలో శుక్రవారం శ్రీ లలిత సహస్రనామ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జనసేన ప్రధాన కార్యదర్శి గురుకుల కిషోర్ దంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. నారాయణ సతీమణి రమాదేవి ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పూజా కార్యక్రమాన్ని వైభవపేతంగా నిర్వహించారు. లలిత సహస్ర నామాలను పఠిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సచివాలయం ఆవరణంలో ఐటిడిపి ఎస్సీ నాయకులు

విశాలాంధ్ర-జలదంకి: మండల కేంద్రమైన జలదంకి పంచాయతీ పరిధిలో బిట్టు-1, బిట్టు-2, ఆర్ బి కే భవనాలు ప్రజల సమస్యల పరిష్కారం కై నిర్మించబడ్డాయని కానీ... సచివాలయం పరిధిలోని ప్రధాన దారి బురద మయంగా మారి నడిచేందుకు ఇబ్బందికరంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఐ టీడీపీ, ఎస్సీ సెల్ నాయకులు ఏగూరి రఘు, అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించిందన్నారు. అయితే సచివాలయాలకు వెళ్లే దారి బురద మయంగా మారి ప్రజలకే సమస్యగా మారిందన్నారు. ఈ మార్గం సుమారు 400 కుటుంబాలు ఉన్న అరుంధతి వాడకు పోవు దారి, మండలంలోని పలు గ్రామాల నుండి సచివాలయంకు సమస్యలు పరిష్కరించు కునేందుకు వచ్చిన ప్రజలకు ఈ పరిస్థితిని చూసి ఇదేమి ఖర్మ రా బాబు అని ఆశ్చర్యపోతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-ఆత్మకూరు : ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి కృషి చేస్తున్నారని, పటిష్టమైన భారతదేశం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని బిజెపి ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వాసిలి గ్రామంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంది మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం మే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ లక్ష్యంగా పని చేస్తుంది అని 2047 కల్లా ప్రతిష్టమైన భారతదేశాన్ని చేయడం కోసం కృషి చేస్తున్న నరేంద్ర మోడీకి ప్రజలందరూ సహకారం అందించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఉజ్వాల గ్యాస్ లు, అయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఆత్మకూరు రూరల్ మండల అధ్యక్షుడు వాసుపల్లి సుధాకర్ రెడ్డి, బిజెపి నాయకులు సుమంత్ రెడ్డి, రామసుబ్బయ్య, పలు శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగస్తులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మానుగుంట

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ సాహిత్య కళ ఉత్సవాల కరపత్రాన్ని శుక్రవారం తన కార్యాలయంలో శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ శ్రీ కళావేదిక తెలుగు సాహిత్య అభివృద్ధికి సూచిక అని, అన్నారు. ఈ నెల 16 ,17. తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా లోని, తాడేపల్లిగూడెంలో బుద్ధాల కన్వెన్షన్ హాలులో ఏక బిగిన 30 గంటల 30 నిమిషాల 30 సెకండ్ల కాలంలో, నిర్విరామంగా కవితా గోష్టులు, కళా ప్రదర్శనలు, నృత్యాలు, నాటకీయ ఘట్టాలు, పాటలు, ఆధునిక సాహిత్యంపై పత్రసమర్పణలు జరగడం సాహిత్య సేవ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సాహిత్య యజ్ఞంలో వెయ్యి మంది సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొనడం తనను అబ్బురపరి చిందన్నారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యులు తెలుగు భాష అభివృద్ధికి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. శ్రీ శ్రీ కళావేదికకు జాతీయ అధ్యక్షురాలుగా ఈశ్వరి భూషణం అత్యంత అంకితభావంతో పనిచేస్తున్నారని, ఉపాధ్యాయురాలుగా, కవయిత్రిగా, రచయిత్రిగా, ఆమె బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శిస్తుండటం ఎంతో ఆనందదాయకమన్నారు. జాతీయ అధ్యక్షురాలుఈశ్వరీభూషణం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని ఉచిత భోజన వసతి సదుపాయం కల్పించి పూలదండ మెమెంటో శాలువాలు సర్టిఫికెట్స్ తో సన్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. నవ యువ కవులను , ప్రోత్సాహం లేనివారిని ప్రోత్సాహం అందించ డమే శ్రీ శ్రీ కళా వేదిక ప్రత్యేకత అన్నారు. ఇప్పటికే వెయ్యి మంది కవులు కళాకారులు రిజిస్ట్రేషన్ అయ్యారని వారందరూ ఈ అవ కాశం సద్వినియోగం చేసుకో వాలని ఈశ్వరీభూషణం కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సిపి నాయ కులు కందుకూరు ఏఎంసి మాజీ చైర్మన్ తోకల కొండయ్య, కందు కూరు మండల పార్టీ అధ్యక్షుడు గంగవరపు వెంకటరావు, కోవూరు సర్పంచ్ ఆవుల మాధవ రావు, కొండి కందుకూరు సర్పంచ్ కుమ్మరి బ్రహ్మయ్య, గణేశం గంగిరెడ్డి, రహీం పాల్గొన్నారు.

వర్షాన్ని లెక్కచేయని అంగన్వాడీల నిరసన

-నాలుగో రోజుకు చేరిన దీక్షలు

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన దీక్ష శుక్రవారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొనసాగించారు. వర్షంలోనూ అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నినాదాలతో హోరెత్తించారు. నగరంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులు పని ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంగయ్య, సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, కిన్నెర కుమార్, షేక్ షాహినా బేగం, బలరాం, కే.పద్మ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఆవల తులసి

విశాలాంధ్ర-మనుబోలు: మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య శిశుడుగా10 సంవత్సరాలనుండి కాకాణి తో అడుగులో అడుగులు వేస్తూన ఆవుల తులసి రామ్ యాదవ్ కి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జగన్ ఆమోద ముద్ర వేసినందుకు శుక్రవారం విజయవాడలో మినిస్టర్ కార్యాలయంలో ఆవుల తులసి రామ్ యాదవ్ కుటుంబ సమేతంగా వెళ్లి కాకాణి ఆశీస్సులు తీసుకున్నారు. కాకాణి తన మీద పెట్టుకున్న నమ్మకానికి రాబోవు 2024 ఎలక్షన్ లో తన వంతు మెజారిటీ తీసుకొచ్చే పూర్తి బాధ్యతగ పని చేస్తానని తులసి యాదవ్ తెలిపారు.

గురువిందపూడిలో వీక్షిత్ భారత సంకల్పయాత్ర ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండలంలోని గురివింద గ్రామంలో శుక్రవారం సర్పంచ్ మన్నెమాల సమతరెడ్డి ఆధ్వర్యంలో వీక్షిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక సంక్షేమ పథకాల గురించి గ్రామస్థాయిలో అవగాహన కలిగించేందుకు ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గురించి ప్రజలకు తెలియజేశారు ఇదే వేదిక పైన ఆయుష్మాన్ భారత్ కార్డులను సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్కే జాకీర్ హౌసింగ్ ఏఈ ఎన్ రవికుమార్ అంగన్వాడి సూపర్వైజర్ రమణమ్మ, వైఎస్ఆర్పి నేత మన్నెమాల సుధీర్ రెడ్డి. బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఓడూరు శ్రీనివాసులురెడ్డి. బిజెపి నాయకులు బోలా శ్రీనివాసులు పెనుమల్లి వెంకట కృష్ణారెడ్డి,104 ఆరోగ్య సిబ్బంది సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 71 వ వర్ధంతి సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంతి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మినీ బైపాస్ జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనుక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. శ్రీరాములు ఆశయాలను కొనసాగించేందుకు జనసేన పార్టీ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఆయన ఆశయాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులు డి. సుజయ్ బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ రామి రెడ్డి, జిల్లా కార్యదర్శి అలియా, నగర ప్రధాన కార్యదర్శి కంతర్, నగర కార్యదర్శి జీవన్, డివిజన్ ఇంచార్జిలో పవన్ అజయ్ అలేఖ్య, వివిధ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రణీత్ దాతృత్వం

విశాలాంధ్ర-ఆత్మకూరు : ఆత్మకూరు ప్రముఖ వైద్యులు ఎస్ వి ప్రజావైద్యశాల ఎండీ డాక్టర్ ప్రణీత్ దాతృత్వ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో నివసిస్తున్న దివ్యాంగురాలు కొమరగిరి రమణమ్మకు తాను చెప్పిన మాట ప్రకారం ప్రతి నెల ఆర్థిక సహాయం అందచేస్తూనే ఉన్నారు. అందులో భాగంగా శుక్రవారం నిత్యావసర సరుకులు అందచేశారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సీఎం నిలబెట్టుకోవాలి

జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలి:ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే నిలబెట్టుకునేలా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్నా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో నిరుద్యోగుల ఆగ్రహానికి వైసీపీ ప్రభుత్వం గురికాక తప్పదన్నారు. నగరంలోని వెంకటేశ్వర జనార్ధన రెడ్డి కాలనీ 54 డివిజన్ సిపిఐ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీని విడుదల చేస్తానని, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ను విడుదల చేస్తానని గతంలో జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఎక్కడా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భక్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా ఈ నెల 15వ తేదీ నుంచి జరగబోయే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో చర్చించి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. రానున్న 2024 ఎన్నికల్లో నిరుద్యోగులను ఏకం చేసి వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు షేక్.గౌస్ బాషా, షబ్బీర్, అల్తాఫ్ అహ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మండలానికో ఉచిత వైద్యశాల నిర్మాణం:పసుపులేటి

విశాలాంధ్ర-బిట్రగుంట: కావలి నియోజక వర్గంలోని అన్ని మండలాలలో మండలానికో ఉచిత వైద్యశాలను నిర్మిస్తామని కాలం తీరి మరణిస్తే తప్ప వైద్యం అందక ఏ పేదవాడు మరణించకూడదని పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ప్రముఖ పారిశ్రామికవేత్త పసుపులేటి సుధాకర్ శుక్రవారం నాగులవరంలో అన్నారు. పసుపులేటి సుధాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు ఎనెల్ వైద్యశాల వారి సౌజన్యంతో బోగోలు మండలంలోని నాగులవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.పై కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు తమ్మిశెట్టి బాలసుబ్రమణ్యంతో పాటు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్ ప్రభాకర్ నాయుడు కే జి గిరిమహేష్ పి హరికృష్ణ నాగేంద్ర ప్రసాద్ కులారి కే చంద్రశేఖర్ ఎనెల్ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తుఫాన్ సాయం పంపిణీ

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండలంలోని వెంకన పాలెం గ్రామంలో శుక్రవారం తుఫాన్ సాయం గిరిజనులకు పంపిణీ చేశారు. 2500 రూపాయలు నగదు, సరుకులు సర్పంచ్ తలారి పెంచలమ్మ, వైఎస్ఆర్సిపి సీనియర్ నేత అడపాల శివకుమార్ రెడ్డి చేతుల మీదుగా 40 గిరిజన కుటుంబాలకు అందజేశారు. మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కృషితో ఈ పరిహారం అందించగలిగామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన పరిహారానికి ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజనులు శివకుమార్ రెడ్డికి ,సర్పంచ్ పెంచలమ్మకు ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో భగవాన్ ,తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీని అడ్డుకున్న దళితులు

విశాలాంధ్ర-ముత్తుకూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా నాలుగు రోజులు పాటు కురిసిన భారీ వర్షాలు కారణంగా సుమారు వారం రోజులపాటు ఉపాధి అవకాశాలు లేకుండా ఉన్న తమకు ప్రభుత్వం నిత్యవసర వస్తువులను పంపిణీ చేయకుండా చేయడం ఏమిటని మండలంలోని వెంకన్నపాలెం ఎస్సీ కాలనీవాసులు బియ్యం పంపిణీని శుక్రవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు వచ్చి ఉప్పు కాలువపక్కనే ఉన్న తమ గ్రామం చుట్టూ ఉప్పునీరు చేరిపోయిందని అందువల్ల తాము సుమారు వారం రోజులపాటు జీవనోపాధి అవకాశాలు లేక పస్తులతో ఉండాల్సిన దుస్థితి నెలకొంది అన్నారు. తుఫాను అనేది అందరికీ దాని ప్రభావం వల్ల ఇబ్బంది పడతారని దీనిని గుర్తించి ఎస్సీలకు కూడా నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాలని అప్పటివరకు పంపిణీ చేయబోయిన భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఉచితంగా పంపిణీ చేయాల్సిన బియ్యం షాపును తెరవనీయకుండా అడ్డుకోవడంతో బియ్యం పంపిణీ నిలిచిపోయింది. పోలీసులు అధికారులు ఎంత నచ్చజెప్పిన తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదని బియ్యం షాప్ ఎదుట బైఠాయించారు. చేసేదిలేకఅధికారులు పోలీసులు అధికారులు వెనుదిరిగారు.

ఆరోగ్య సేవలు గురించి శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా 3257 చికిత్సలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు గురించి శిక్షణ కార్యక్రమం ద్వారా మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సి కిషోర్ కుమార్ డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ రావు హెల్త్ సూపర్వైజర్ రమా, సతీష్ బాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, హెల్త్ట్రైకటరీలు పాల్గొన్నారు

బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ:కురుగొండ్ల

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు గ్రామ పంచాయతీ నందు శుక్ర వారం తెలుగు దేశం పార్టీ మాజీ శాసన సభ్యులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త కురుగొండ్ల రామకృష్ణ ఇంటింటికి తిరుగుతూ బాబు ష్యూరిటీ,-భవిష్యత్తుకు గ్యారంటీ బ్యాండ్ రూపంలో తెలియజేశారు. తెలుగు దేశం అధ్యక్షులు దందొలు వేంకటేశ్వర్లరెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగా దందొలు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమం లో భాగంగా మండల క్లస్టర్ ఇం చార్జీ కొండ్లపూడి రాఘవ రెడ్డి, తిరుపతి పార్ల మెంట్ అధికారి ప్రతినిధి నువ్వులశివరామకృష్ణ పంచాయితీ అధ్యక్షులు ఏదోటి కోటేశ్వరరావు,రాష్ట్ర ఎస్ సిసెల్ కార్యనిర్వాహక కార్యదర్శిపచ్చి గర్ల రత్నం,మండల మహిళ అ ధ్యక్షురాలు చివులూరు రమణమ్మ, షేక్ గౌసే సహకారంతో ఉదయం నుండి కార్యకర్తలతో కలిసి ఇంటి ఇంటికి తిరుగుతూ బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిశీల కులు ఏలేశ్వరం రామచంద్రయ్య రాష్ట్ర యువత కార్యదర్శి కెవికె ప్రసాద్, సైదాపురం నాయకులు కాపా శ్రీనివాసులు నాయుడు, మండల నాయకులు పరంధా మరెడ్డి, శివారెడ్డి, రాజా, వెంక టేశ్వర్లు నాయుడు, రియాజ్, లతీఫ్, మహేంద్ర, దేవినేని వెం కటరత్నం నాయుడు, పత్తిపాటి వెంకటరత్నం, కొమ్మి జంగం నాయుడు, పచ్చా నరేష్, రమేష్, మండల ముఖ్య నాయ కులు, ఐటీడీపీ నాయకులు సాయి, బూత్ కన్వీనర్లు కిరణ్, మహిళ నాయకురాలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెయ్యి దూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ముత్తుకూరు: పెయ్యి దూడల పథ కాన్ని రైతులు సద్విని యోగం చేసుకో వాలని వల్లూరు పశు వైద్యాధికారి రాజ్యలక్ష్మి రైతులను కోరారు. శుక్రవారం అదానీ ఫౌండేషన్, బ్రైఫ్ ఫౌండేషన్ సంస్థలు, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మల్లూరు సచివాలయం వద్ద ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పశు వైద్యులు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కేవలం పెయ్యి దూడలు మాత్రమే పుట్టేందుకు అవసరమైన శమన్ను బ్రైఫ్ ఫౌండేషన్ సంస్థ ఎనిమిది వందల యాభై రూపాయల విలువ కలిగిన సెమన్ ను రైతులకు సబ్సిడీపై 170 రూపాయలకే పంపిణీ చేస్తోందన్నారు. ఈ సంస్థ గ్రామాలలో ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి రైతులకు అవసరమైనటువంటి ఉచితంగా మందులను మినరల్ మిక్చర్ ను ఈ కార్యక్రమాన్ని ప్రధాని ఫౌండేషన్ దత్తత తీసుకున్న గ్రామాల్లో మాత్రమే వారు చేస్తున్నారని ఆమె తెలిపారు. అలాగే గడ్డి మొక్కలను కూడా ఉచితంగా ఈ సంస్థ ఇస్తుందని ఆమె తెలిపారు.తుఫాన్ కారణంగా బాధిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా దానామృతాన్ని అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, పై సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన దానామృతాన్ని, అతని సంస్థ ఇచ్చిన మినరల్ మిక్చర్ మందులను ఆమె పంపిణీ చేశారు.

గట్టుపల్లిలో ఫ్రీ హోల్డ్ పట్టాల పంపిణీ

విశాలాంధ్ర-జలదంకి: గట్టుపల్లి సచివాలయంలో శుక్రవారం ఫ్రీ హోల్డ్ పట్టాల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ కాకాని ప్రవంతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు కాకాని మహదేవయ్య మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పొలాలకు, అసైన్డ్ డీకేటి పట్టాలు ఉన్న రైతన్నలకు ముఖ్యమంత్రి జగనన్న ఫ్రీ హోల్డ్ పట్టాల పంపిణీ తో పూర్తి హక్కులు కల్పించారన్నారు. ఈ పట్టాలతో రైతు కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆ దిన సురేష్, వీఆర్వో శివ, వి ఆర్ ఏలు, లబ్ధిదారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

విశాలాంధ్ర-బిట్రగుంట: ఆంధ్ర రాష్ట్ర అవతరణకె ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అజరామరుడని తెలుగు జాతి ఉన్నంత కాలం ఆయన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుం దని ప్రముఖ పారిశ్రామికవేత్త పసుపులేటి సుధాకర్ శుక్రవారం జువ్వలదిన్నెలో అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జువ్వలదిన్నెలోని పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పసుపులేటి వెంకటేశ్వర్లు పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

ఆదర్శప్రాయులు శ్రీ పొట్టి శ్రీరాములు: కొండ్రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం అమరులైన శ్రీ పొట్టి శ్రీరాములు నాటి-నేటితరాలకు ఆదర్శప్రాయులని నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి చెప్పారు. శుక్రవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు71వ వర్ధంతిని విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగఫలితమే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. స్వర్ణ వెంకయ్య, సిహెచ్ హరిబాబు యాదవ్, మల్లు సుధాకర్ రెడ్డి, వేలూరు శివ సునీల్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు సయ్యద్ మోబీనా, పాలకీర్తి రవికుమార్, వేలూరు శ్రీధర్ రెడ్డి, నెల్లూరు పవన్ కుమార్ రెడ్డి, సిహెచ్ సూరిబాబు, కొండేటి శివారెడ్డి పాల్గొన్నారు.

తెలుగువారమని చెప్పుకుంటున్నామంటే పొట్టిశ్రీరాములు కృషి ఫలితమే :షేక్. అబ్దుల్ అజీజ్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్దగల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మద్రాసు ప్రెసిడెన్సీ లో మనం మద్రాసీయులుగా పిలవబడే వారమనీ తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు రావాలని, 58 రోజులు ఆమరణ దీక్ష చేసి, తెలుగు వారి కోసం ప్రాణాలను అర్పించిన మహనీయులు ఆయనని భూమి ఉన్నని రోజులు పొట్టిశ్రీరాములు అమరజీవులే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దర్శి హరికృష్ణ, బ్రహ్మం గుప్త, కొండా ప్రవీణ్, వేమా హజరత్,నారా శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంతదితరులుపాల్గొన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం:ఎంపీడీవో

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన వలేటివారిపాలెం మండల పరిషత్ నందు సర్వసభ్య సమావేశము జరుగును. కనుక జడ్పిటిసి ,ఎంపీటీసీలు ,కో ఆప్షన్ నెంబర్,సర్పంచులు ,మండల స్థాయి అధికారులు ,పంచాయతీ కార్యదర్శులు తప్పక నివేదికలతో హాజరు కావలసినదిగా కోరారు.

ప్రకాశం విద్యార్ధుల ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: 208 మంది ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు, తమ ఫైనల్ ఇయర్ మొదటి సెమిస్టర్ పూర్తయ్యే నాటికి, వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు అయినటువంటి విప్రో, ఇంపార్, యం కోర్, - కనెక్ట్, సి.జి.ఐ మరియు ఎక్సెల్ ఆర్ లలో ఉద్యోగ అవకాశాలను పొందినట్లు కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ తెలిపారు. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు మంచి విద్యతో పాటు ఉద్యోగ భరోసా కల్పించడమే తమ ధ్యేయమన్నారు. రాబోయే రోజుల్లో తనకున్న కార్పొరేట్ సంబంధాలతో మరిన్ని ప్రాంగణం ఎంపికలను కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఉద్యోగం పొందిన విద్యార్థులు మాట్లాడుతూ, క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ నుండి ప్రాంగణ ఎంపిక తుది దశ వరకు తమ కళాశాల అందించిన సహాయ సహకారాల ద్వారా ఈ విజయాన్ని అందుకోగలిగామన్నారు. 16 సంవత్సరాలు హెచ్.సి.యల్ లో పనిచేసిన అనుభవం ఉన్న తమ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ రిటర్న్ ఎగ్జామ్స్, గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్ మరియు హెచ్.ఆర్ ఇంటర్వ్యూస్ లాంటి దశలను విజయవంతంగా ఛేదించడానికి, చేసిన దిశా నిర్దేశం తమకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. స్వతహాగా డైరెక్టర్ అయినప్పటికీ ప్లేస్ మెంట్ సెల్లో కీలక పాత్ర పోషించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన శ్రీనివాస్ కు విద్యార్థులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఫోటోషూట్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వరపర్ల హరిబాబు, ఏ.ఓ దాసరి కొండల రావు, వివిధ డిపార్ట్మెంట్ల ప్లేస్మెంట్ కో ఆర్డినేటర్స్ బాలకృష్ణ, గద్దె సురేష్, యన్ మాధవ, కొల్ల కోటయ్య, శ్రీనివాస రెడ్డి, షరీఫ్ మరియు హెచ్ఓడిలు విద్యార్థులతో పాటు పాల్గొన్నారు.

విఎస్‌యూలో అంతర్ కళాశాలల మహిళా గేమ్స్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాగణ మైదానం లో ఘనంగాఅంతర్ కళాశాలలమహిళా గేమ్స్టోర్నమెంట్‌ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.రామ చంద్ర రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రతి మనిషికి జీవితంలో క్రీడలు ఎంతో ఆరోగ్యానికి దోహదం చేస్తాయని అలాగే క్రీడలకు వయసుతో సంబంధం ఉండదని, గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. విశ్వవిద్యాలయంలో11 క్రీడలకుగాను15 కళాశాలల నుండి 250 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ నంద్ కుమార్ బాబు, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ కే సునీత,కార్యక్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రమ్మ, విశ్వవిద్యాలయపీడీలుడాక్టర్ ప్రవీణ్ కుమార్,మణికంఠ తదితర కళాశాల క్రీడా అధ్యాపకులు పాల్గొన్నారు. ఖో-ఖో, వాలీబాల్, హ్యాండ్ బాల్,బ్యాడ్మింటన్, చేస్ మొదలైన క్రీడలలో హోరా హోరి గా తలపడినారు

జోరుగా ఇంటూరి నాగేశ్వరరావు ప్రచారం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు చేపట్టిన బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం కందుకూరు నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. కందుకూరు పట్టణంలో ప్రధానంగా ముస్లిం కాలనీల్లో పది రోజుల నుంచి ఆయన కలియ తిరుగుతూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీ మినీ మేనిఫెస్టోను వివరించే కార్యక్రమమే అయినప్పటికీ దానికి సంబంధించిన కరపత్రాలు పంచడంతోపాటు ప్రజల సమస్యలు బాధలు తెలుసుకోవడానికి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్నారు. నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ఓపికగా వింటున్నారు. చిన్న చిన్న సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో ఫోన్లో మాట్లాడి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తుండడంతో ముస్లిం కుటుంబాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆంక్షలతో సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని కూడా ఆ మహిళలే తీవ్రంగా విమర్శిస్తున్నారు. ముఖ్యంగా చంద్ర బాబు తీసుకొచ్చిన దుల్హన్ పథకం, పేద ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపిం దని సంతోషంతో చెబుతున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో కందుకూరులో ముస్లిం సమాజానికి ఏమాత్రం మేలు జరిగిందో ఒక్కసారి పరిశీలించుకొని, ఎవరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకోవాలని నాగేశ్వరరావు సూచించారు. రాబోయే ఎన్నికల్లో తనకు అవకాశం కల్పిస్తే, కందుకూరు ప్రాంతాన్ని రోల్ మోడల్ గా చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.

తపాలా ఉద్యోగుల తలరాతలు మారవా?: యూనియన్ నాయకులు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: ప్రభుత్వాలు మారుతున్నా తపాలా ఉద్యోగుల సమస్యలు తరతరాలుగా పేరుకు పోతున్నాయని అఖిలభారత గ్రామీణ తపాలా కేంద్ర ఉద్యోగ సంఘాలైన ఎన్‌యుజిడి ఎస్, ఏఐజీడిఎస్యు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రెండు సంఘాల పిలుపుమేరకు ఈనెల 12 నుండి దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా కందుకూరు పోస్ట్ ఆఫీస్ దగ్గర శుక్రవారం ధర్నా జరిగింది. ధర్నాను ఉద్దేశించి ఆ సంఘాల నాయకులు తిరుమల శెట్టి నరసింహారావు పాకల మాధవరావు ఉన్నం వాణి లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న సంస్థ ఒక్క పోస్టల్ డిపార్ట్మెంట్ మాత్రమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న పోస్టల్ ఉద్యోగులను బిక్షగాళ్లుగా మారుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టల్ ఉద్యోగుల కోరికలు నెరవేర్చటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు. సివిల్ సర్వెంట్ హోదా వెంటనే ఇవ్వాలని ఎనిమిది గంటల పని భారం కల్పించాలని 12, 24, 36 అదనపు సర్వీసు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ 5 లక్షలకు పెంచాలని, వారు డిమాండ్ చేశారు. జిడిఎస్ కంట్రిబ్యూషన్ 10 శాతం మరియు డిపార్ట్మెంట్ 10 శాతం కాంట్రిబ్యూషన్ ఇవ్వాలని, అలాగే తాత్కాలిక పెన్షన్ ఇవ్వాలని వారు కోరారు. ఇన్సెంటు కమిషన్ పద్ధతి రద్దుచేసి ఐపిపిబి, ఆర్పిఎల్ఐ, పిఎల్ఐ, ఎన్ఆర్ఇజిఎస్ మరియు అన్ని రకాల సేవింగ్స్ పనిభారంలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ఎదు ర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతమని వారు చెప్పారు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ఆఫీసులో వర్క్ చేసుకుని తిరిగి డెలివరీ చేయటానికి ఏమాత్రం సమయం సరిపోదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. టార్గెట్లు పూర్తి చేయమని ఫోన్లతో ఉన్నతాధికారులు వేధింపులు రోజురోజుకీ పెరిగిపో తున్నాయని అన్నారు. పని భారం పెరుగుతుంది కానీ అందుకు అనుగు ణంగా జీతాలు పెంపు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు జివిఎస్వి ప్రసాద్, డి.పద్మావతి, జి మహేష్ ,వి భువనేశ్వరి, పి రామ్ మోహన్ రావు, బాబ్ జాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మా భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు

చట్టపరంగా చర్యలు తీసుకోండి:బాధితుల మొర

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట: ఏఎస్ పేట మండలం గుడిపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న తమ భూములను ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు జెసిబి లతో చదును చేసి గనాలు వేసి ఆక్రమించాలని చూస్తున్నారని భూయజమాని మాదాల శివాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమేరకు ఏఎస్పేట ఎస్సై, సిఐలకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన తాము ఏఎస్పేట మండలం గుడిపాడు గ్రామంలోని సర్వేనెంబర్ 191-1లో నాలుగెకరాల 14 సెంట్లు భూమిని చల్లా శీను వద్ద కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన భూమిని ఈ ఏడాది అక్టోబర్ లో రిజిస్టర్ కూడా చేయించుకున్నామని తెలిపారు. అయితే గుడిపాడు గ్రామానికి చెందిన హజరత్ అయ్యా, పెంచలయ్య అనువారు తాము గ్రామంలో లేమన్న ఉద్దేశంతో వారి అనుచరులతో భూమిని కాజేయాలన్న దురుద్దేశంతో గత రెండు రోజులుగా జెసిబి లతో చెట్లు తొలగించి చదును చేస్తున్నారని తెలిపారు. తామెల్లి అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. వారిని ఎదిరించలేక తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని తమకు న్యాయం చేయాలని కోరారు.

అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సిపిఐ, ఏఐటియుసి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: అంగన్వాడి వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించవలసిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించటం నియంత పాలనను గుర్తు చేస్తున్నదని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు అన్నారు. తాసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడి వర్కర్స్ చేస్తున్న సమ్మెకు సిపిఐ ఏఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సురేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో అబద్ధపు మాటలు చెప్పి గెలిచిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ పోకడలు అనుసరిస్తున్నారని విమర్శించారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. అంగన్వాడి వర్కర్ల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచించకుండా ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయటం రెచ్చగొట్టే విధానానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తాము సంపూర్ణ మద్దతు తెలియజేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు పి బాలకోటయ్య కార్యదర్శి వై ఆనందమోహన్ పాల్గొన్నారు.

కాపుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

- ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రభాకర్ నాయుడు పిలుపు

విశాలాంధ్ర - కావలి : డిసెంబర్ 17వ తేదీ ఆదివారం కావలి పట్టణం పెంకుల ఫ్యాక్టరీ సమీపంలోని ఏటూరి కల్యాణ మండపం నందు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని, నియోజకవర్గంలోని కాపు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా వైద్యులు, కాపు నాయకులు డాక్టర్ ప్రభాకర్ నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కారోనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కాపు నేతలతో కలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా జరిగే ఈ కార్యక్రమంలో కాపుల ఐక్యత, సత్తా చాటుదామన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మధ్యాహ్నం విందు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాపుల ఐక్యతలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గంలోని కాపు కుటుంబ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయవలసినదిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాసులు, తోట వెంకట శేషయ్య, సమ్మును వెంకట సుబ్బయ్య, సాదు శ్రీధర్, పాలడుగు వెంకటేశ్వరరావు, పసుపులేటి బాబురావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, తోకల వెంకటేశ్వర్లు, రామిశెట్టి కిషోర్, పసుపులేటి బాలు, బెల్లంకొండ వేణు పాల్గొన్నారు.